ఆగర్తిపాలెం పాఠశాలకు గ్రహణం

- ఉపాధ్యాయులు లేక తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య
- పట్టించుకోని పాలకులు




ఆగర్తిపాలెం ఆంధ్రా ఎవాంజకల్ లూథరన్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఎంతో చరిత్ర ఉన్న ఈ పాఠశాల నిర్వహణకు అవసరమైన తరగతి గదులు, క్రీడామైదానం అన్నీ ఉన్నా ఉపాధ్యాయులు లేక విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంది. ప్రస్తుతం ఇక్కడ 23 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా, ఒక ప్రభుత్వ ఉద్యోగి, నలుగురు వాలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులు పాలకొల్లు లేదా నరసాపురం వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు.

150 ఏళ్ల చరిత్ర

ఆగర్తిపాలెంలో ఆంధ్ర ఎవాంజకల్ లూథరన్ చర్చి, గుంటూరు వారి ఆధ్వర్యంలో సుమారు రెండెకరాల స్థలంలో 1882లో ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలను స్థాపించారు. 1903లో మిడిల్ స్కూల్‌గా, 1965లో హైస్కూల్‌గా వర్గోన్నతి చెందింది. ఆగర్తిపాలెం లూథరన్ హైస్కూల్ 1967లో మొట్టమొదటిసారిగా ఈ పాఠశాల నుంచి ఎస్‌ఎస్‌ఎల్‌సీ విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ పాఠశాలలో చదువుకున్న మేడిది రవికాంత్ ఐఏఎస్ అయ్యారు. నిమ్మల రామానాయుడు ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. మేకా శేషుబాబు జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీగా పనిచేశారు. చాలా మంది గ్రూప్ 1, గ్రూప్ 2 ఆఫీసర్లుగా రాష్ట్ర నలుమూలలా పనిచేస్తున్నారు. ధర్మారావు ఫౌండేషన్, బెంజమయ్య ఫౌండేషన్లు మరో రెండు తరగతి గదులను నిర్మించారు. ఎందరో ఈ పాఠశాల నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలకు వెళ్లి బహుమతులు సాధించారు. అదే స్ఫూర్తితో ఏటా ఈ గ్రామంలో యువత ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తుంటారు. ఈ పాఠశాల నిర్వహణకు అవసరమైన తరగతి గదులు, క్రీడామైదానం అన్నీ అనుకూలంగా ఉన్నాయి.

జెడ్పీలో విలీనం చేయాలి

ఎయిడెడ్ పాఠశాలను జిల్లా పరిషత్‌తో విలీనం చేస్తే విద్యార్థుల సంఖ్య పెరిగి మళ్లీ పూర్వ వైభవం చెందుతుందని స్థానికులు చెబుతున్నారు. ఆగర్తిపాలెం నుంచి చాలా మంది విద్యార్థులు ఉన్నత విద్య కోసం నరసాపురం, వెలివెల, పాలకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలకు వెళుతున్నారు.

వలంటీర్లతో నిర్వహణ



నేను ఇదే పాఠశాలలో చదువుకున్నా. ఇదే పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నా. పాఠశాలపై ఉన్న గౌరవంతో 2021 నుంచి గత నాలుగేళ్లుగా వలంటీర్లను నియమించి నా సొంత డబ్బులు జీతాలుగా చెల్లించి పాఠశాలను నడుపుతున్నాను. సుమారు రూ.9 లక్షలు గత నాలుగేళ్లుగా జీతాలు అందించా. ఈ సొమ్ములు ఇవ్వాలని ఆంధ్రా ఎవాంజికల్ లూథరన్ చర్చి బిషఫ్‌కి లేఖలు ద్వారా తెలియపరిచా. అయినా స్పందన లేదు.

– యండాపు రాజన్‌బాబు, సీనియర్ అసిస్టెంట్, ఆగర్తిపాలెం

ఉపాధ్యాయుల బదిలీతో ఇబ్బందులు



గ్రామంలోని ఎయిడెడ్ పాఠశాలకు ఎంతో చరిత్ర ఉంది. స్వాతంత్ర్యం రాక ముందు నుంచి ఈ గ్రామంలో పాఠశాల ఉంది. క్రిష్టియన్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల నడుస్తోంది. నాలుగేళ్ల నుంచి పాఠశాల పరిస్థితి రోజురోజుకీ మారిపోయింది. ఈ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయారు.

– ఎం మైఖేల్‌రాజు, స్థానికుడు

క్లుప్తంగా

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

పెనుగొండ: దొంగరావిపాలెం టోకు కూరగాయల మార్కెట్ వద్ద కొండాలమ్మ ఆలయ 20వ వార్షికోత్సవాలు శుక్రవారం ముగిశాయి. శ్రీవెంకటేశ్వర కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో వారం రోజులుగా వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. పరిసర గ్రామాల భక్తులు వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, బుట్టబొమ్మల కోలాహలం, బాణసంచా కాల్పులతో హోరెత్తించారు.

వియర్ చానల్ పూర్తికి కృషి

నరసాపురం రూరల్: రైతులకు ఉపయోగకరమైన వియర్ చానల్ నిర్మాణానికి తమ ప్రభుత్వం కృషి చేస్తామని జిల్లా వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఉపాధ్యక్షుడు గుబ్బల మార్రాజు తెలిపారు. శుక్రవారం ఆయన మొగల్తూరు మండలం ముత్యాలపల్లి మోడి ప్రాంతంలో నిలిచిపోయిన వియర్‌చానల్ పనులను పరిశీలించారు. ఆయన వెంట పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

రోగులకు మందుల పంపిణీ

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు పరిసర గ్రామాలకు చెందిన పలువురు రోగులకు వాకర్స్ క్లబ్ తరపున రూ.15 వేలు విలువైన మందులను పంపిణీ చేశారు. శుక్రవారం పాలకొల్లు వాకర్స్‌క్లబ్ కార్యాలయంలో క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు చేతుల మీదుగా పాలకొల్లు, కాపవరం, పోడూరు మండలం జగన్నాథపురానికి చెందిన రోగులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రిజస్ట్రేషన్ చేసుకోవాలి

యలమంచిలి: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులంతా అగ్రి స్టాక్ ఫార్మర్ రిజస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పేరు నమోదు చేసుకున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలను పొందడంలో సహాయపడే ఒక వ్యవస్థని చెప్పారు. రైతులంతా రైతు సేవా కేంద్ర ఇన్‌చార్జి ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

13న మండల పరిషత్ సమావేశం

యలమంచిలి: ఈ నెల 13న గురువారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ సమావేశం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనలను అనుసరించి నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం



సచివాలయ ఉద్యోగుల సంఘం నూతన క్యావర్గం

నరసాపురం: ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నరసాపురం శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. స్థానిక పార్కురోడ్డులో నిర్వహించిన సంఘ సమావేశంలో అధ్యక్షురాలిగా తాళాబత్తుల సుబ్బలక్ష్మి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా షేక్ మొసీనా, ఉపాధ్యక్షులుగా పులగండం ఎస్‌వీఎస్ వాసు, జనలర్ సెక్రటరీగా అడపా సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా కూడా ప్రభూజీ, ఆర్గనైజింగ్ సెక్రటీలుగా ఉంగరాల నరేష్, పొన్నాల సునీలా, భారతి యశోద, కోశాధికారిగా గుండు కృష్ణవంశీ, మరో 10 మంది సభ్యులను ఎన్నుకున్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జీఆర్ఎస్ఎన్ రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ వై.మోహనరావు, ఉపాధ్యక్షుడు షేక్ ఉమర్ ఆలీషా, నాయకులు ఎం లక్ష్మీనారాయణ, సీహెచ్ సతీష్, కె.శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా పోరాడాలని పిలుపు నిచ్చారు.

ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం



నరసింహస్వామి కల్యాణోత్సవం

నరసాపురం: స్థానిక యర్రమిల్లి వారి వీధిలోని యోగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రి మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసుల శేషాచార్యుల ఆధ్వర్యంలో మోచర్ల సత్యకృష్ణ, శిరీష కుమారి దంపతులు కల్యాణ పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గోటేటి లక్ష్మీనారాయణ, నంద్యాల వెంకట శేషారావు, పతివాడ మార్కండేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నులిపురుగులతో ఆరోగ్యానికి చేటు



ఆల్‌బెండజోల్ మాత్రలు అందిస్తున్న దృశ్యం



పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: కడుపులో నులిపురుగుల వల్ల తరచూ అనారోగ్య సమస్యలు ఏర్పడతాయని మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగు నివారణ సంబంధిత పోస్టర్‌ను ఎంపీడీఓ ఎస్ఎస్ ఉమామహేశ్వరరావు శుక్రవారం విడుదల చేశారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులు 1182 మంది, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో 4,334 మంది పిల్లలకు నులిపురుగు నివారణ మాత్రలు అందించనున్నట్లు చెప్పారు. ఎంఈఓ జి వీరాస్వామి, ఈవోపీఆర్డీ తాళ్ల మూర్తిబాబు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, రూరల్ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సత్తిబాబు, కార్యాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ పోస్టర్ విడుదల

నరసాపురం రూరల్: మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ దినేష్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆల్‌బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ లక్ష్మీ పార్వతి మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు గల పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. మండలంలో ఈ నెల 10న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 61 అంగన్‌వాడీలు, 71 పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 9,358 మంది విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఎంఈఓ కె.శామ్యూల్‌జాన్, ఐసీడీఎస్ సీడీపీఓ బి.ఊర్మిళ, ఎంపీహెచ్ఈఓ ఏఎస్ఎన్ మూర్తి, ఎంపీహెచ్ఎస్ బి.శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ ఎం సావిత్రి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గర్భిణుల రిజిస్ట్రేషన్ తప్పనిసరి



పూలపల్లిలో నిర్వహిస్తున్న ఆరోగ్య పోషణ దినోత్సవం

పాలకొల్లు అర్బన్: గర్భిణుల వివరాలను అంగన్‌వాడీ వర్కర్లు రిజిస్ట్రేషన్ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి అన్నారు. పాలకొల్లు మండలం పూలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు గ్రామ ఆరోగ్య పోషణ దినోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. బాల సంజీవిని కిట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ పి.ఎలిజబెత్, ఏఎన్ఎం విజయశాంతి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పెనుగొండ డీఈఈగా రామకృష్ణ



దొమ్మేటి రామకృష్ణ

పెనుగొండ: పెనుగొండ సబ్ డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈగా దొమ్మేటి రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉంగుటూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన కె.రాంబాబు పదోన్నతిపై అమలాపురం ఈఈగా బదిలీ అయ్యారు.

ఉన్నత విద్యకు ఆర్థిక సాయం



హిమబిందుకు సాయం అందిస్తున్న బీవీ రమణ

పెనుగొండ: ఇరగవరం మండలం కాకిలేరు గ్రామానికి చెందిన ముత్యాల హిమబిందు ఉన్నత విద్యకు విశ్రాంత ప్రిన్సిపాల్ డీసీహెచ్ హనుమంతరావు రూ.30 వేలు సాయాన్ని పెనుగొండ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. హిమబిందు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఖండవల్లిలోని స్పిన్నింగ్ మిల్లులో కూలీగా చేరింది. ములపర్రు బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు బీవీ రమణ ద్వారా విషయం తెలుసుకున్న విశ్రాంత ప్రిన్సిపాల్ హనుమంతరావు సాయం అందించేందుకు ముందుకొచ్చారు. హనుమంతురావు, రమణలకు హిమబిందు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్వేది ఉత్సవాల సందడి

- లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణానికి పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన నరసాపురం పంటు రేవు
- పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



పంటురేవు వద్ద యాత్రికుల క్యూలైన్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీవేద

నరసాపురం: నరసాపురంలో అంతర్వేది ఉత్సవాల సందడి నెలకొంది. అంతర్వేది లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవానికి భక్తులు పోటెత్తారు. దూరప్రాంతాల నుంచి భక్తులు నరసాపురం మీదుగా గోదావరి రేవులో పంటు ఎక్కి అంతర్వేది వెళ్లారు. ఈ రేవు శుక్రవారం మధ్యాహ్నం నుంచి కిటకిటలాడింది. రేవు నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వరకు యాత్రికుల క్యూలైన్ కనిపించింది. అర్ధరాత్రి వరకు రేవులో ఇదే రద్దీ కొనసాగింది. రేవులో భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ శ్రీవేద ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ పంటు రేవును పరిశీలించి, పరిమితికి మించి పంటుపై ప్రయాణికులను అనుమతించవద్దని ఆదేశించారు. పంటు వద్ద తొక్కిసలాట జరగకుండా విడివిడిగా రెండు క్యూలైన్‌లు ఏర్పాటుచేశారు. రేవు వద్ద వైద్య ఆరోగ్యశాఖ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసింది. ఆర్టీసీ కూడా యాత్రికుల రద్దీ రీత్యా ప్రత్యేక బస్సులు నడిపింది. నరసాపురం డిపో నుంచి 10 బస్సులు, జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం నుంచి కూడా మరో 20 ప్రత్యేక బస్సులు తిప్పారు. బస్టాండ్‌లో కూడా అంతర్వేది యాత్రికుల రద్దీ కనిపించింది. కృష్ణా, విజయనగరం, గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో యాత్రికులు రైళ్లలో నరసాపురం చేరుకుని అంతర్వేది తరలి వెళ్లారు. శనివారం అంతర్వేదిలో స్వామివారి రథోత్సవం వైభవంగా జరగనుంది. దీనికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. యాత్రికుల తిరుగుప్రయాణానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్డీఓ దాసిరాజు అధికారులను ఆదేశించారు. శనివారం స్టీమర్‌రోడ్డు పొడవునా యాత్రికులకు పులిహోర, అల్పాహారం అందించేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు చేశాయి.